క్లుప్తంగా

నేడు తుక్కుగూడలో మంత్రి పర్యటన

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో గురువారం మంత్రి సబితారెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు జిన్నాయిగుట్ట శ్రీలక్ష్మీనరసింహా స్వామి ఆలయ పరిశీలన, అనంతరం రావిర్యాల 4వ వార్డులో గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన, 2వ వార్డులో ఎల్లమ్మ ఆలయం వీధి దీపాల ప్రారంభం, రావిర్యాల పెద్దచెరువు సుందీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకాగలరని కమిషనర్ కోరారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడలో బుధవారం బొడ్రాయి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ హోమాలు నిర్వహించిన అనంతరం బొడ్రాయిని వైభవంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

మహేశ్వరం: మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. వెంకటయ్య ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, మహేందర్‌రెడ్డి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

పహాడీషరీఫ్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా నిలుస్తోందని జల్‌పల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శ్రీరాంకాలనీకి చెందిన చంద్రకళ అనారోగ్యానికి గురవ్వడంతో లక్ష్మీనారాయణ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించి మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సిఫారసు మేరకు మంజూరైన రూ.33,500 చెక్కును కౌన్సిలర్ బుధవారం బాధితురాలి కుమారుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రావిర్యాలలో కంటివెలుగు శిబిరం



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మధుమోహన్

తుక్కుగూడ: కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు(రావిర్యాల)లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన స్థానిక కౌన్సిలర్ శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కంటి పరీక్షలతో పాటు కళ్లజోడు, మందులు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివకుమార్, డాక్టర్ రాజుకుమార్, మున్సిపల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు తగవు: బీఆర్‌ఎస్

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తరచూ నిరాధార ఆరోపణలు చేయటం సబబుకాదని బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు అన్నారు. మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మన్సూరాబాద్ పెద్దచెరువును, సర్వే నంబర్ 93లోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన చరిత్ర నర్సింహారెడ్డిదని ఆరోపించారు. డివిజన్‌లో ఇళ్లు నిర్మించుకొనే వారిని భయభ్రాంతులకు గురిచేసి వసూళ్లకు పాల్పడుతున్న విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. చెరువుల కబ్జాపై, డివిజన్‌లోని అభివృద్ధి నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా.. అని సవాలు చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై మరోసారి నిరాధార ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఇకనైనా ఎమ్మెల్యేపపై నిరాధార ఆరోపణలు మానుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌యాదవ్, కేకేఎల్ గౌడ్, ఎర్రుల యాదయ్య, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

కాలనీలకు మహర్దశ



మౌంట్ కార్మెల్ స్కూల్ నుంచి సుమా ప్యారడైజ్ వరకు ఉన్న ప్రధాన రహదారి

- 16 ఫీట్లకు విస్తరించనున్న 30 డివిజన్ ప్రధాన రోడ్డు
- మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.50 కోట్ల నిధుల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో రోడ్డు వెడల్పు కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి చొరవ తీసుకుని ఇటీవలనే రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. బడంగ్‌పేట అంబేద్కర్ చౌరస్తా నుంచి మొదలుకొని చివరగా ఉన్న సుమా ప్యారడైజ్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు ఈ రోడ్డుకు ఆనుకుని ఉన్న కాలనీలకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా టెలిఫోన్ కాలనీ, ఆశంగారి రెడ్డి కాలనీ (ఏజీఆర్), లక్ష్మీదుర్గ, ఎంసీఆర్, రోమా–2,3,4, మెట్రో సిటీ, సుమా ప్యారడైజ్, ద్వారకాహిల్స్, వెంకటేశ్వర కాలనీ, 119 సర్వే నంబర్‌లోని 60 గజాలు (సబితారెడ్డి కాలనీ), కొత్తగా ఏర్పాటు అవుతున్న జర్నలిస్ట్ కాలనీలు ఇందులో ఉన్నాయి. ఈ కాలనీలకు అన్నింటికి ఒకే రోడ్డు అందుబాటులో ఉండటంతో ఉన్న 12 ఫీట్ల రోడ్డును 16 ఫీట్లు చేసేందకు నిధులు మంజూరు చేశారు.

బస్సు కూడా వెళ్లలేని పరిస్థితి..

ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులకు ఈ రోడ్డు వల్ల ఉపశమనం కలుగనుంది. ఈ రహదారి వెంట వెళ్లేవారికి ఒక కారు వస్తే ఎదురుగా వచ్చే వాహనాలు ఆగవలసి వస్తుంది. గతంలో ఈ కాలనీలకు వెళ్లేందుకు బస్ సౌకర్యాన్ని కల్పించారు. అయితే రోడ్డు వెడల్పు లేకపోవడంతో బస్సు సర్వీస్‌ను నిలిపివేశారు. ఇటీవల అక్కడక్కడ ఉన్న గుంతలను సరిచేయడంతో బస్ సర్వీస్ సేవలను తిరిగి పునరుద్ధరించారు. నాలుగురోజుల క్రితం మంత్రి సబితారెడ్డి విచ్చేసి కాలనీలకు ప్రధానంగా ఉన్న ఈ రోడ్డు విస్తీర్ణం కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బంది తీరుతుంది

ఈరోడ్డుగుండా పెద్ద బండ్లు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్‌జాం తప్పదు. ఇదే రోడ్డులో సెంట్రల్ స్కూల్ కూడా ఇదే లైన్లో ఉంటుంది. వాళ్ల బస్‌లు ఎక్కువగా ఉన్నాయి. రోడ్డు వెడల్పు చేయాలని స్థానిక కార్పొరేటర్ దృష్టికి పలుమార్లు తీసుకుపోయాం. మంత్రి ప్రత్యేక చొరవతో రోడ్డు వెడల్పుకు నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఈ రోడ్డు వెడల్పు వలన సుమారు 14కు పైగా కాలనీలకు ఉపయుక్తంగా ఉండనుంది. మంత్రి సబితారెడ్డి, కార్పొరేటర్ స్వప్నకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– డానియల్, రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి, బడంగ్‌పేట

మెట్లబావి అభివృద్ధి పనులు ప్రారంభం



మెట్లబావి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆనందం, నాయకులు

మహేశ్వరం: బన్సీలాలాల్ పేటలో ఉన్న మెట్లబావి తరహాలో మహేశ్వరం మెట్ల బావిని మంత్రి సబితారెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయం సమీపంలో ఉన్న కొనేరు మెట్ల బావి అభివృద్ధికి రూ.90 లక్షల నిధులతో పనులను ఆయన ప్రారంభించారు. మెట్ల బావి శిథిలావస్థకు చేరడంతో మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మెట్లబావి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారన్నారు. మెట్లబావి, గడికోట, శివగంగ రాజరాజేశ్వర ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్లు చంద్రయ్య, బాల్‌రాజ్, వార్డుసభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, లింగం, అరుణ, శ్రీనివాస్, రాజేష్, శ్రీశైలం, కుమార్, రమేష్, వీరుబాబు, సంజీవ, ఆజాం, చందు పలువురు పాల్గొన్నారు.

మాటల గారడీతో కాలయాపన

ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పురుషోత్తం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఎంసీపీఐయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బొడ్రమోని పురుషోత్తం అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4,5,6 తేదీల్లో వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను పురుషోత్తం ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పురుషోత్తం మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు రక్షణ కవచమైన 111 జీఓను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాలను లీకేజీతో నిరుద్యోగుల గొంతుకోశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. మాటల గారడీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాళ్లు ఆర్.ఝాన్సీ, బి.సుజాత, భానుప్రసాద్, సంధ్యారాణి, అరుణ, నాగమణి, స్వరూప, జగదాంబ, కృష్ణ తదితరులున్నారు.

అధికారులు, నేతలు సమన్వయంతో పనిచేయాలి



కందుకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్



మీర్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగేశ్వర్

ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీఓ సూరజ్‌కుమార్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బందితో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. ఈనెల 2వ తేదీ నుంచి ఈ నెల 22వ తేదీ వరకు 21రోజుల పాటు జరిగే ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. షెడ్యూల్ వారీగా ఏరోజు చేపట్టాల్సిన పనులను ఆరోజు పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో ఉత్సవాలను జయప్రదం చేసేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం డీఏఓ జ్యోతి, కందుకూరు తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, కందుకూరు ఎంపీడీఓ వెంకట్రాములు, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, మహేశ్వరం ఎంపీఓలు రామకృష్ణ, శ్రీకాంత్, ఫారూక్‌హుస్సేన్, నర్సింహులు, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, బాలాపూర్ తహసీల్దార్లు జ్యోతి, మురళి, కృష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఉత్సవాలు..

మీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో పార్టీలకతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ పిలుపునిచ్చారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 2 నుంచి 22 వరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. దీనిపై కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుల సలహాలు, సూచనలు స్వీకరించామని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలు అంబరాన్నంటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు అంబరాన్నంటాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శేరిగూడలో నియోజకవర్గ స్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వరాష్ట్రం సాధించుకున్న అనంతరం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటాచారి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, జెడ్పీటీసీ జంగమ్మ, ఏసీపీలు ఉమామహేశ్వర్‌రావు, పురుషోత్తంరెడ్డి, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్ శాఖ ఎస్సీ, డీఈలతోపాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

కడ్తాల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మురళీకృష్ణ,ఎంపీడీఓ రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీఓ మధుసూదనాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

'ఏపీజీవీబీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- రీజనల్ మేనేజర్ భీంసేన్‌రావు



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడ్తాల్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ముందజలో ఉందని బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ భీంసేన్‌రావు అన్నారు. ఆర్థిక అక్షరాస్యత సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత కొన్నినెలల క్రితం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మక్తమాధారం గ్రామానికి చెందిన పచ్చిపాల సురేశ్‌కు జనరల్ ఇన్సూరెన్స్ క్లైయిమ్ కావడం జరిగింది. మృతుడు బ్యాంకు ఖాతాదారుడు కావడంతో జనరల్ ఇన్సూరెన్స్ కింద రూ.4 లక్షలు క్లైయిమ్ కావడం జరిగింది. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుడి భార్య పి.సంధ్య(నామిని)కి సంబంధిత చెక్కును భీంసేన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా భీంసేన్‌రావు మాట్లాడుతూ.. ఖాతాదారులు బ్యాంకు అందించే సేవలను వినియోగించుకోవాలని.. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, వ్యక్తిగత ప్రమాద బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా కుటుంబానికి భద్రత కల్పించుకోవచ్చని సూచించారు. అదేవిధంగా రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు వృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు. అనంతరం బ్యాంకు ద్వారా అందుతున్న వివిధ సేవలను ఖాతాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రమేశ్, ఎస్‌బీఐ బీడీఎం నరేశ్, బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్, ఫీల్డ్ అధికారి నర్గీస్, అకౌంటెంట్ ఆంజనేయులు, క్యాషియర్ అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 31, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 40. దొండ 23, ఆలు 20, ఉల్లి 12, గోకర 35, దోస 13, సార 15, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 55, కాప్సికమ్ 65. **గమనిక:** ఈ ధరల గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సంక్షేమ పథకాలను వివరించాలి



రైతువేదికలో మాట్లాడుతున్న బలదేవ్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రైతుబంధు కోఆర్డినేటర్ కందాళ బలదేవ్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బుధవారం గ్రామ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి, మండల వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మన్, గ్రామ రైతు బంధు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'మహార్యాలీ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో జూన్ 4న హైదరాబాద్‌లో నిర్వహించే లింగాయత్‌ల మహార్యాలీ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఇబ్రహీంపట్నంలోని శ్రీభవానీ నాగలింగేశ్వర ఆలయంలో ఆవిష్కరించారు. ర్యాలీ లో పెద్దసంఖ్యలో లింగాయత్ కులస్థులు పాల్గొనాలని ఆసంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు శెట్టి శివకుమార్, కర్నె అరవింద్, మల్లప్ప, నాగేశప్ప, కుమారప్ప, మల్లికార్జున్, మహేశ్ పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

మంచాల: ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే లింగాయత్ మహా ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. బుధవారం మంచాలలో లింగాయత్ మహార్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భిక్షపతి, అధ్యక్షుడు శేఖరప్ప, ప్రధాన కార్యదర్శి హరీశ్, నాయకులు జ్ఞానేశ్వర్, సోమప్ప, ఆనందప్ప, కోటప్ప, చంద్రకాంత్, విజయప్ప, ప్రభు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల బాధితులకు పరిహారం అందించండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

- అదనపు కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి

యాచారం: మంతన్‌గౌరెల్లి గ్రామంలో రెండు నెలల కింద వడగళ్లు కురిసి రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వెంటనే వారికి పరిహారం అందజేసి ఆదుకోవాలని బుధవారం సీపీఎం బృందం.. జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కలిసి మంతన్‌గౌరెల్లి, కేసీతండా, భానుతండా గ్రామాల్లో 600కు పైగా రేకుల ఇళ్లు, 100 ఎకరాలకు పైగా వరి, కూరగాయలు, పండ్లతోటలకు తీవ్ర నష్టం జరిగిందని, దాదాపు రూ.3 కోట్లకు పైగా రైతులు, ప్రజలు నష్టపోయారని తెలియజేశారు. అధికారులు వచ్చి పంటనష్టంపై నివేదకను కూడా ఉన్నతాధికారులకు అందజేశారని అయినప్పటికీ ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. అలాగే వడగళ్లకు రేకుల ఇళ్లు పూర్తిగా రంధ్రాలు పడి పేదలు ఇబ్బందులు పడుతున్నారని వారి ఇళ్ల నిర్మాణాలకు పరిహారం అందించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ వర్గ సభ్యులు బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా, మండల కమిటీ సభ్యులు తావునాయక్, చందునాయక్, నాయకులు మల్లేశ్, గడ్డం కుమార్, నర్సింహా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతన్న

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం మోస్తారు వర్షం కురిసింది. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు మంగళవారం కురిసిన వర్షాలకు మెట్ట పంటల సాగుపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా రోహిణి కార్తెలో విత్తనాలేస్తే పంట బాగా వచ్చి మంచి దిగుబడి వస్తుందని రైతులకు ఎంతో నమ్మకం. దీనిని దృష్టిలో ఉంచుకొని బుధవారం తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఆరుతడి పదును భూమిలోనే జొన్నలేశారు. పచ్చ జొన్నల విత్తనాలేస్తే రోహిణి కార్తెలో మంచి దిగుబడి వస్తుందని రైతులకు ఎంతో నమ్మకం.